క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఈవో రాంచందర్

నెన్నెల: రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని భీమిని ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్ సూచించారు. గురువారం నెన్నెల, మన్నెగూడం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూజ్ విత్తనాలు ఎవరు కొనుగోలు చేయవద్దని గ్లైసిల్, బీటీ పత్తి విత్తనాలు వేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసేటప్పుడు రశీదు తీసుకోవాలన్నారు. ఏఈవో రాంచందర్, రైతులు ఉన్నారు.

ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నరేశ్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 8 ఓపెన్ జిమ్‌ల్లో పాడైన పరికరాలకు మరమ్మతు చేయాలని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేశ్ కోరారు. మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్‌జిమ్‌ల్లో కొన్ని పరికరాలు పాడైనట్లు తెలిపారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. పరికరాలు పనిచేయకపోవడంతో ప్రజలు కసరత్తు చేసేందుకు అసౌకర్యంగా ఉంటుందని, వెంటనే వాటికి మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు తాజుద్దీన్, సుంకరి రమేశ్, శ్రీరాముల మల్లేశ్ ఉన్నారు.

టీఏ, డీఏలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆశవర్కర్లకు టీఏ, డీఏలు ఇవ్వాలని కోరుతూ గురువారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ వలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు అంబటి సువర్ణ మాట్లాడుతూ గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆశ వర్కర్లకు ఎన్నికల డ్యూటీలు వేశారు. ఇప్పటి వరకు డ్యూటీలకు సంబంధించి టీఏ, డీఏలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇతర మండలాల్లో ఆశవర్కర్లకు ఇచ్చారని తెలిపారు. ఈ విషయంపై అధికారులు దృష్టిసారించి, టీఏ, డీఏ లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ కార్యదర్శి బుచ్చయ్య, ఆశ వర్కర్ల యూనియర్ కార్యదర్శి నీరజ, సీఐటీయూ కన్వీనర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు నరకడంపై అభ్యంతరం



చెట్టును నరుకుతున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని పాత రతన్‌లాల్ హోటల్ స్థలంలో నూతనంగా ప్రారంభమవుతున్న సూపర్‌మార్కెట్‌కు అడ్డుగా ఉందని ఏళ్లుగా ఉన్న వేపచెట్టును నరికేయడంపై సమాజసేవకులు కొట్టె నటేశ్వర్, అబ్దుల్ రహీంలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలోని చెట్లను నరుకుతుంటే అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

అధికారులతో సమీక్ష సమావేశం

వేమనపల్లి: మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీవో శ్రీపతి బాపురావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీఐ డేటా సరిచేసుకుని మళ్లీ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని, ట్రేడ్‌లైసెన్స్‌ను రెన్యూవల్ చేయాలన్నారు. పల్లెప్రకృతివనాలు, శ్మశానవాటిక, డంపింగ్‌యార్డులను వినియోగంలోకి తేవాలన్నారు. ఆయా పంచాయతీల వద్ద ప్రత్యేక అధికారులు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు తాగేదెలా..?



మూడో జోన్‌లోని మురుగుకాల్వలో తాగునీటి పైపులైన్



రైల్వేస్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల వద్ద మురుగుకాల్వలోనే తాగునీటి పైపులైన్

- మురుగుకాల్వల్లో తాగునీటి పైపులు
- కాలనీల్లో కలుషిత నీరే సరఫరా
- అనారోగ్యం బారినపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

మినరల్ వాటర్ కొంటున్నాం



రామాలయం ఏరియాలో సింగరేణి క్వార్టర్లకు వెనుక గల్లీలో మురుగుకాల్వలో తాగునీటి పైపులైన్ ఉంది. నీరు సరఫరా చేసేటప్పుడు మురుగునీరు వస్తుంది. మినరల్ వాటర్ కొంటున్నాం. అధికారులు పట్టించుకోవాలి.

– బుంగ సురేందర్, మాజీ సింగరేణి ఉద్యోగి, మూడవ జోన్ రామాలయం ఏరియా

కొన్ని పైపులైన్లు గుర్తించాం

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీల్లో మురుగుకాల్వల్లో తాగునీటి పైపులున్నా విషయాన్ని గుర్తించాం. వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేస్తున్నాం. కాలనీల్లో మిషన్ భగీరథ నీరు ప్రజలకు క్రమం తప్పకుండా అందిస్తున్నాం.

– అచ్యుత్ మున్సిపల్ ఏఈ, మందమర్రి

మందమర్రిరూరల్: పట్టణ ప్రజలకు తాగునీరందించాల్సిన మున్సిపల్, సింగరేణి అధికారులు కలుషిత నీరే సరఫరా చేస్తున్నారు. దీంతో వారు అనారోగ్యం బారినపడుతున్నారు. అయినా శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వల్లోనే తాగునీటి పైపులైన్లు ఉండటం ప్రమాదకరంగా మారింది. ప్రజలు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పత్రికల్లో వార్తా కథనాలు ప్రచురితమైనా పట్టించుకున్నా దాఖలాలు లేవు.

మురుగుకాల్వలు అడ్డంగా పైపులైన్..

పట్టణంలోని సింగరేణి కార్మికవాడల్లో, మున్సిపాలిటీ వార్డుల్లో మురుగుకాల్వలకు అడ్డంగా తాగునీటి పైపులు ఉన్నాయి. కురిసిన వర్షపునీరు కాలువల గుండా బయటకు వెళ్లేక్రమంలో అడ్డంగా ఉన్న పైపులు వద్ద మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వస్తోంది. తాగునీటి పైపులు నాలుగైదు దశాబ్దాల క్రితం వేసినవి కావడం, పలుచోట్ల తుప్పుపట్టి, రంధ్రాలు ఏర్పడి మురుగునీరు పైపుల ద్వారా నీరు సరఫరా అవుతుంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ నీటిని తాగాల్సి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. సమీప ప్రాంతాల్లో వాటర్‌ప్లాంట్ల ద్వారా కొందరు నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకుని మున్సిపల్, సింగరేణి అధికారులు మురుగుకాల్వల్లోని నీటి పైపులైన్లు తొలగించి కొత్తవి ఏర్పాటు వేసి పరిశుభ్రమైన తాగునీరందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర

మందమర్రిరూరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మందమర్రిలో శ్రీ పంచముఖి హనుమాన్ ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో భక్తులు గురువారం శోభాయాత్ర నిర్వహించారు. పాలచెట్టు హనుమాన్ టెంపుల్ వద్ద ప్రారంభమైన ఈ యాత్ర కాలనీల గుండా మార్కెట్ మీదుగా కోల్‌బెల్ట్ రహదారిపై సాగింది. అనతంరం ఆలయాన్ని చేరుకుంది. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షాపరులు భక్తిలో మునిగితేలారు.



పాల్గొన్న భక్తులు

అటెన్షన్ ప్లీజ్

చెట్ల కొమ్మలు తొలగించరూ..

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో విద్యుత్ తీగలకు చెట్లకొమ్మలు అల్లుకున్నాయి. దీంతో గాలి దుమారం వీచే సమయంలో మంటలు లేచి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. చెట్లకొమ్మలు తొలగించాలని గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వర్షాకాలంలో ప్రమాదం ఉందని వెంటనే చెట్ల కొమ్మలను తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలి కోరుతున్నారు.

అధికారి: రాధారాథోడ్ ఎంపీడీవో భీమారం,
సెల్: 91822 41323



లాభాలు ప్రకటించి 35 శాతం వాటా ఇవ్వాలి

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాలను వెంటనే యాజమాన్యం ప్రకటించి వచ్చిన లాభాల్లో 35 శాతం కార్మికులకు వాటా ఇవ్వాలని సింగరేణి మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కారుకూరి లక్ష్మణ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి రెండు నెలలవుతున్నా ఇప్పటివరకు సంస్థకు వచ్చిన లాభాలను యాజమాన్యం ప్రకటించలేదని ఆరోపించారు.

యూనిఫాంలు గడువులోగా అందించాలి



తాండూర్: హెచ్‌ఎంలకు యూనిఫాంలు అందజేస్తున్న యాదయ్య, కిషన్



బెల్లంపల్లిరూరల్: సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

తాండూర్: విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు అందించేలా చర్యలు చేపట్టాలని డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో కిషన్ అధికారులకు సూచించారు. మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపడుతున్న యూనిఫాంలు కుట్టే పనులను గురువారం పరిశీలించారు. మాదారం కేంద్రంలో పనులు పరిశీలించి జూన్ రెండవ తేదీలోగా యూనిఫాంలు అందుబాటులోకి తెచ్చేలా చూడాలని ఆదేశించారు. కిష్టంపేట కుట్టు కేంద్రంలో ఇప్పటికే పూర్తయిన 20 పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. అనంతరం చౌటపల్లి, కేజీబీవీ పాఠశాలల్లో అభివృద్ధి పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో ప్రభాకర్, ఏపీఎం పోమానాయక్ ఉన్నారు.

బెల్లంపల్లిరూరల్: మాలగురిజాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కుట్టు కేంద్రంలో యూనిఫాంలను డీఆర్‌డీవో కిషన్ పరిశీలించారు. గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐకేపీ సీసీలు సుందరేశ్, ప్రసాద్, వీఏవో భాగ్య, సిబ్బంది ఉన్నారు.

లక్సెట్టిపేట: ఎంఈవో కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలను ఎంఈవో రవీందర్ గురువారం హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో కుట్టించిన 1104 మంది విద్యార్థుల యూనిఫాంలను వారికి అందజేశారు. ఎంపీవో ప్రసాద్, ఐకేపీ ఏపీఎం లక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయలక్ష్మి గురువారం సందర్శించారు. పాఠశాలల్లో అమ్మఆదర్శ కమిటీల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలు తెరిచేలోగా పనులు పూర్తిచేయాలన్నారు. యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్లకు వెళ్లి యూనిఫాం కుడుతున్న తీరును పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా కుట్టడం పూర్తికావాలన్నారు. ఆమె వెంట సీఆర్పీ రమేశ్ ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

ఖాతాదారులకు మెరుగైన సేవలు

చెన్నూర్: చెన్నూర్ ప్రాంత ప్రజలు, ఖాతాదారులకు చేరువగా మెరుగైన సేవలందించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెన్నూర్ శాఖను నూతన భవనంలో మార్చామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల సిరాజ్ కాంప్లెక్స్‌లో మార్చిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెన్నూర్ శాఖను బ్యాంక్ రీజనల్ హెడ్ డీజీఎం అపర్ణరెడ్డి, లీడ్ డ్రిస్టిక్ట్ మేనేజర్ తిరుపతితో కలిసి గురువారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలకు ఈ బ్యాంక్ సేవలందిస్తుందన్నారు. బ్యాంక్ మేనేజర్ సాగర్, తహసీల్దార్ మల్లికార్జున్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంక్ ఇండియా చెన్నూర్‌శాఖను ప్రారంభిస్తున్న కలెక్టర్

జీలుగ విత్తనాలు పంపిణీ

మందమర్రిరూరల్: పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ రైతులకు గురువారం జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందమర్రి మండలానికి 100 బస్తాల జీలుగు విత్తనాలు వచ్చాయని తెలిపారు. ఒక్కో బస్తా 30 కిలోలు ఉండగా ధర రూ.1,116 ఉంటుందని పేర్కొన్నారు. 30 కిలోల బస్తా రెండు ఎకరాలకు సరిపోతుందన్నారు. ఏఈవో తిరుపతి, సుధారాణి, నిర్వాహకుడు వెంకటేశ్ ఉన్నారు.

కాసిపేటలో..

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట సహకార సంఘం కార్యాలయంలో ఏవో వందన ఆధ్వర్యంలో గురువారం రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఏఈవో రమ్య, పీఏసీఎస్ సీఈవో రాజశేఖర్, రైతులు ఉన్నారు.

అన్నదానం..

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐబీ చౌరస్తాలో విద్యుత్ మహిళా తరంగిణి ఆక్టివిటీస్ గ్రూప్ సభ్యులు వేసవికాలం సందర్భంగా మజ్జిగ పంపిణీ చేపట్టగా, ముగింపు సందర్భంగా గురువారం అన్నదానం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ 2022లో మహిళా దినోత్సవం సందర్భంగా తమ సంస్థను ఏర్పాటు చేసి, పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అన్నదాతలుగా వ్యవహరించిన కొండా శైలజ, రాంచందర్ దంపతులు, బాలకృష్ణ, పద్మజ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.రమ, సరిత, పద్మ, సంధ్య, లావణ్య, సునీత, మంజుల, రమ,నవ్య, రేఖ, సుశీల, సత్య, కమల పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు



బెల్లంపల్లి: పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు



జన్నారం: నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

బెల్లంపల్లి: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) 54వ ఆవిర్భావ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. బెల్లంపల్లిలో యూనియన్ కార్యాలయం ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు అనురాధ సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారం కోసం దేశంలో 1970 మే30న సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. అప్పటినుంచి కార్మిక వర్గం పక్షాన అలుపెరుగని పోరాటాలు సాగిస్తోందని పేర్కొన్నారు. నాయకులు రమణ, చల్లూరి దేవదాసు, రవీందర్, సంకీర్తన్, అరుణ్‌కుమార్, లత, గంగా, రామక్క, రేణుక, రాధక్క, శారద, నీల పాల్గొన్నారు.

తాండూర్: మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు జెండా ఆవిష్కరించారు. జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు సత్తమ్మ, నానయ్య, శంకర్, రాజేశం, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలో సీఐటీయూ జెండాను నాయకులు ఆవిష్కరించారు. సీఐటీయూ కన్వీనర్ అంబటి లక్ష్మణ్, కార్యదర్శి బుచ్చయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల కార్యదర్శి చేపూరి లక్ష్మి, హమాలి సంఘం అధ్యక్షుడు రవి, సీఐటీయూ నాయకులు అంబటి సువర్ణ, నీరజ, రాములు, రాజేందర్, నగేశ్ పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని సీఐటీయూ నాయకురాలు కరీమా సీఐటీయూ పతాకాన్ని ఎగరవేశారు. నాయకులు సమ్మక్క, యామిని, ఉమారాణి, పోసక్క తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిపై సీఐటీయూ ఫిట్ సెక్రెటరీ వెంకటేశ్ జెండాను ఆవిష్కరించారు. యూనియన్ ఏరియా అధ్యక్షుడు వెంకటస్వామి, యూనియన్ నాయకులు నవీన్, ఆదర్శ్, శ్రీనివాస్, శివకుమార్, చైతన్యరెడ్డి, రాంబాబు తదితరులు ఉన్నారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీలో నాయకులు జెండాను ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జి ప్రకాశ్, రైస్‌మిల్స్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు ఇంగు రాంచందర్, నాయకులు జి మొగిళి, రౌతు శంకర్, సురేందర్, శేఖర్, నాగయ్య, పోశం తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకుడు



నస్పూర్: జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



చెన్నూర్‌లో జెండాను ఎగరవేస్తున్న సీఐటీయూ నాయకురాలు

మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



తాండూర్: కేక్ కట్ చేసి పంపిణీ చేస్తున్న నాయకులు



పాతమంచిర్యాల: వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తాండూర్: రాష్ట్రమంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను తాండూర్ మండలంలో కాంగ్రెస్ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించాయి. మండల కేంద్రంలో నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఎంపీటీసీ సిరంగి శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా, మాజీ సర్పంచ్ సుభాష్, నాయకులు పుట్ట శ్రీనివాస్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలకంఠేశ్వర్‌రావు, పార్టీ నాయకులు మార్కండేయులు, రాజగోపాల్, నర్సింహ, ఆనంద నిలయం నిర్వాహకులు పాల్గొన్నారు.

పరామర్శ

పాతమంచిర్యాల: పాతమంచిర్యాల శివారులోని శాలివాహన పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ వర్కర్‌గా పనిచేస్తున్న రంగపేటకు చెందిన గంగుల శ్రీనివాస్ (48) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్ గురువారం పరామర్శించారు. కార్మికుడి కుటుంబానికి యాజమాన్యం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

బ్రిడ్జి మరమ్మతు పనులు ప్రారంభం

తాండూర్: తాండూర్ రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో వెంటనే స్పందించిన రైల్వే అధికారులు బ్రిడ్జి రోడ్డు మరమ్మతు పనులు గురువారం ప్రారంభించారు. ఈ పనులను నాయకులు సిరంగి శంకర్, ఈసా, తిరుపతి, శంకర్, శివ పరిశీలించారు.

మెడికల్ కిట్ల పంపిణీ



హెల్పర్లకు మెడికల్ కిట్లు అందజేస్తున్న సీడీపీవో

చెన్నూర్: ఐసీడీఎస్ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 240 అంగన్‌వాడీ కేంద్రాల్లోని హెల్పర్లకు సీడీపీవో మనోరమ గురువారం మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. సీడీపీవో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారినపడితే చిన్నారులకు వెంటనే మందులు అందజేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.